కథ

# కంటేనే కూతురా!

## -ద్విభాష్యం అమ్మాజీ

**అ**ది శీతాకాలం. సాయంత్రం అయిదుగంటలకే సూర్యాస్తమయం ప్రారంభమయింది. సన్నగా చలిగాలి మొదలైంది.

సుజాత తన పెరటితోటలో, తాను ప్రేమతో పెంచుతోన్న పూల మొక్కల మధ్యలో వనదేవతలా తిరుగుతూ పచార్లు చేస్తోంది.

ఆ మొక్కలంటే తనకి ప్రాణంతో సమానం. తనకి మనసు బాగుండన ప్పుడల్లా, మొక్కల్లో తిరగడం అల వాటు.


శేఖర్ అప్పుడే ఆఫీసునించి వచ్చి, ఇల్లంతా సుజాతకోసం వెతికాడు. సాధార ణంగా ఇంట్లో లేకపోతే, తోటలోనే ఉంటుం దని శేఖర్‌కి తెలుసు.

శేఖర్ తోటలో ఉన్న సుజాత వద్దకి, నెమ్మదిగా అడుగులేస్తూ వచ్చాడు. సుజాత ఆ ఉదయం కొత్తగా పూసిన పచ్చగులాబీ పువ్వుని చూసి "బిడ్డని చూసి సంబరపడే తల్లిలా" ఆనందంతో పర వశించిపోతోంది. శేఖర్ రాకని గుర్తించలేదు.

శేఖర్ సుజాత భుజంమ్మీద చేయివేసి, అంత ఆనందాన్నీ ఒక్కదానివీ పొందితే ఎలా! నేనొకడిని ఉన్నానని గుర్తుం చుకోవోయ్! అని నవ్వుతూ సుజా తని దగ్గరకి తీసుకున్నాడు. సుజాత శేఖర్ గుండెలో తలదాచుకుని పరవశంతో కళ్లు మూసుకుని ఉండిపోయింది.

శేఖర్ సుజాతలది ప్రేమవివాహం. శేఖర్ ఆరడుగుల అందగాడు. ఏ విధమైన దురల వాట్లూ లేవు. సన్నగా, పొడుగ్గా, పసిమిఛా యతో, పెద్దకళ్లతో, మళ్లీచూడాలనిపించే అందం సుజాతది. ఇద్దరూకూడా ఇంజనీ రింగ్ పాసయ్యారు. చదువుకునేరోజుల్లోనే, ఒకరినొకరు ఇష్టపడి, పెళ్లి చేసుకోవాలనే అభిప్రాయానికి వచ్చారు. చదువు పూర్తవ గానే, పెద్దల అనుమతితో, ఇద్దరూ పెళ్లి చేసుకున్నారు.

శేఖర్‌కి వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగం వచ్చింది. ఇద్దరూ వైజాగ్‌లో కాపురం పెట్టారు. శేఖర్‌కి పెద్ద క్వార్టర్స్ ఇచ్చారు. క్వార్టర్స్‌చుట్టూ పెద్దస్థలం ఉంది. ఆ స్థలంలో సుజాత, పెద్ద పూలతోట వేసింది. రోజూ, మొక్కలన్నింటికీ స్వయంగా నీళ్లు పోస్తుంది. ఇంట్లో పనం తాకూడా తానే



చేసుకుంటుంది.

సుజాత, శేఖర్‌ల పెళ్లయి పది సంవత్సరా లైంది. వారికి ఇంతవరకూ పిల్లలు పుట్టలేదు. వారిద్దరికీ కూడా, పిల్లలంటే చాలాఇష్టం. సుజాతకి ఒక మంచి ఇల్లాలిగా, సంఘసేవకు రాలిగా జీవితం గడపడం ఇష్టం. ఎవరికేనా కష్టం వస్తే, వెంటనే వెళ్లి వారిని ఆదుకునేది. అందువల్లనే, చదువుకున్నా కూడా ఉద్యోగం చేయడానికి ఇష్టపడలేదు.

శేఖర్ తల్లితండ్రులకి ఒక్కడే కొడుకు. బోలెడు ఆస్థి ఉంది. భార్యాభర్తలి ద్దరూ ఎంత అన్యోన్యంగా ఉన్నా, పిల్లలు లేరనే దిగులు ఇద్దరికీ కూడా మన శ్శాంతి లేకుండా చేస్తోంది. ఆ దిగులు తెలి యకుండా ఉండడా నికి సుజాత తగినంతపని కల్పించుకుంటుంది.

సుజాత స్నేహితురాలు రజని అమెరికాలో ఉంది. ఒక రోజు సుజాతకి ఉత్తరం వచ్చింది. తన పాపతో కలసి ఇండి యాకి వస్తు న్నాననీ, సుజాతని చూడ్డానికి తప్ప కుండా వస్తాననీ రజని రాసింది. చాలా కాలానికి తన స్నేహితురాలిని చూడబో తున్నానని సుజాతకి చాలా ఆనందంగా ఉంది. శేఖర్ రాగానే ఈ వార్త చెప్పింది.

రజని ఇండియాకి వచ్చి తన వారందరినీ కలసితర్వాత తిరుగుప్రయాణంలో సుజాత వద్దకి వచ్చింది. చాలాకాలం తర్వాత స్నేహి తులు ఇద్దరూ కలుసుకున్నారేమో, ఒకరినొ కరు పట్టుకుని కబుర్లు చెప్పుకోవడంలో టైమ్ తెలీలేదు. సుజాత పాపని ఎత్తుకుని తెగ మురిసిపోయింది.

పాప తెల్లగా, బొద్దుగా, బాబ్డ్ హెయిర్‌తో జూలుగౌను వేసుకుని, చేతులకి బంగారుగా జులు, మెడలో లాకెట్‌చైన్‌తో చూడగానే ముద్దొచ్చేలా ఉంది.

సుజాత భోజనాల ఏర్పాట్లు చేసింది. పాపకి తానే స్వయంగా అన్నం తినిపించింది. తర్వాత పాపని పడుకోపెట్టి శేఖర్, సుజాత, రజని కబుర్లు చెప్పుకుంటూ భోజనాలు చేశారు.

భోజనాలయ్యాక సుజాత, రజని డ్రాయింగ్‌రూమ్‌లో కూర్చుని ఒకరి విషయాలు ఒకరికి చెప్పుకున్నారు.

'నీకు పిల్లలు పుట్టలేదుకదా! డాక్టరుకి చూపించుకున్నావా?' అని అడిగింది రజని. దాంతో సుజాతకి లోపలఉన్న బాధంతా ఏడుపురూపంలో పైకి వచ్చేసింది. రజని సుజాతని నెమ్మదిగా ఓదార్చింది.

డాక్టర్ చూసి నాలో ఏ లోపం లేదన్నారు. నా దురదృష్టానికి ఎవరుమాత్రం ఏంచేయగలరు! అని సుజాత రజనితో చెప్పి మా ఇద్దరికీ కూడా పిల్లలంటే చాలాఇష్టం. మా బంధువులలో చాలామంది వారి పిల్లలని పెంపకానికి ఇస్తామంటూ వచ్చారు. ఆయన ఇష్టపడలేదు. వాళ్లందరూ మా ఆస్తికోసం కాచుకుని ఉన్నారు అంది. నేనుకూడా మొదట్లో నీలాగే బాధపడ్డాను. నాకు పిల్లలు పుట్టే అవకాశం లేదని డాక్టరు చెప్పారు. నేను నా ఫ్రెండ్‌ద్వారా ఒక లేనింటిపాపని తెచ్చుకుని పెంచుకున్నాను. ఈ విషయం నాకూ నా భర్తకీ తప్ప ఎవరికీ తెలీదు. ఈ పాప నాకు పుట్టినదే అని ఇండియాలో మన వారంతా అనుకుంటున్నారు. ఈ విషయం నీవుకూడా ఎవరితోనూ అనవద్దు! అంది రజని. పెంచుకునేదేదో మగపిల్లవాడిని తెచ్చుకోక, ఆడపిల్లనెందుకు తెచ్చుకున్నావ్! అంది సుజాత.

ఆ మాటకి రజని ఆశ్చర్యపోలేదు. నవ్వింది. ఈ మాట చాలామంది నోటినుంచి విన్నాను. అనాథ అయిన మగపిల్లల్ని పెంచుకోడానికి ఎందరో వస్తారు. ఆడపిల్లల్ని ఎవరు పెంచుకుంటారు చెప్పు-అంది. ఆ మాట సుజాత మనసులో గాఢంగా నాటుకుంది.

నాలుగురోజులున్నాక రజని పాపని తీసుకుని వెళ్లిపోయింది. సుజాత రజనికీ పాపకీ బట్టలు పెట్టింది. రజని ఉన్న నాలుగురోజులూ పాపతో సుజాత ఆనందంగా గడిపింది. రోజు రోజుకీ సుజాతలో ఉన్న ఉత్సాహం తగ్గిపోసాగింది. సుజాతని కొద్దిరోజులు ఎక్కడికైనా తీసికెళ్తే మార్పుగా ఉంటుందని శేఖర్‌కి అనిపించింది.

"కంటేనే కూతురా! పెంచుకుంటే మాత్రం కూతురు కాదా!" అనే స్థాయికి సుజాత మనసు ఎదిగింది.

అంతేకాదు పెంచుకుంటే కొడుకుని కాదు. కూతుర్నే పెంచుకోవాలి అని తెలుసుకుని ఆచరించగలిగింది.

హైదరాబాద్‌నించి సుజాత చెల్లెలు నీలిమ ఉత్తరం రాసింది. నీలిమ కొడుకు అభిషేక్‌కి ఏడాది పుట్టినరోజు జరుపుతున్నాం రమ్మని రాసింది.

శేఖర్ పదిహేనురోజులు సెలవుపెట్టి సుజాతతో హైదరాబాద్ వచ్చాడు. వారి రాకకి నీలిమ, ఆమెభర్త సతీష్ చాలా ఆనందించారు. నీలిమ కొడుకు మంచి రంగు,



బొద్దుగా ముద్దుగా అందంగా ఉన్నాడు. సుజాతకి అభిషేక్‌తో ఆడుకోవడంతో టైం తెలీడంలేదు.

అభిషేక్ పుట్టినరోజునాడు అందరిలాగ పెద్ద పార్టీగాని, పేరంటంగాని చేయడం లేదు. దిల్‌షుక్‌నగర్ వద్ద గడ్డి అన్నారంలో రెడ్‌క్రాస్‌వాళ్ల అనాథాశ్రమం ఉంది. ఆ అనాథాశ్రమంలో పిల్లలందరికీ పిండివంటకాలతో భోజనం పెట్టేలా డబ్బు కట్టింది నీలిమ. పిల్లలందరికీ పంచిపెట్టడానికి చాక్లెట్స్, పెన్నులు కొంది.

పుట్టినరోజునాడు అభిషేక్‌కి తలంటి నీళ్లు పోసి, కొత్తబట్టలు తొడిగి వాడిని తీసుకుని నీలిమ, సతీష్, శేఖర్, సుజాత కలసి కారులో అనాథాశ్రమానికి వెళ్లారు. అనాథాశ్రమం చాలా పెద్దది. ఏభైమంది పిల్లలు ఉన్నారు. అయిదుగురుపిల్లలు ఒక రూమ్ చొప్పున మంచాలు, పుస్తకాలు పెట్టుకునేందుకు, బట్టలకీ అలమార్లు ఉన్నవి ఇచ్చారు. భోజనాలు చేయడానికి పెద్దహాలు ఉంది. అందరికీ కూడా కంచాలు, గ్లాసులు ఉన్నాయి. మేడ మీద పెద్దహాలులో ఒక కలర్ టి.వి ఉంది. పిల్లలు కూర్చుని టి.వి చూడ్డానికి బెంచీలు ఉన్నాయి. మంచి ప్రోగ్రామ్స్ ఉన్నా, ఆదివారంనాడు తప్పనిసరిగా పిల్లలకి టి.వి చూపిస్తారు.

బిల్డింగ్‌చుట్టూ పెద్ద గార్డెన్ ఉంది. సాయంత్రాలు పిల్లలచేత ఒక గంటసేపు తోటపని చేయిస్తారు. వంటమనిషి, ఆయా ఉన్నారు.

వీరు వెళ్లేసరికి వంటలు పూర్తయి వీరి రాక కోసం ఎదురుచూస్తున్నారు. నీలిమ పిల్లలందరికీ చాక్లెట్స్, పెన్నులు పంచిపెట్టింది. పిల్లలందరూ కలసి అభిషేక్‌కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. భోజనాలకిముందు ప్రేయర్ చేశారు. అందులో ఒకపాప తన శ్రావ్యమైన గొంతుతో గీతలోని శ్లోకం

"పరిత్రాణాయ సాధూనాం
వినాశాయచదుష్కృతాం
ధర్మసంస్థాపనార్థాయ
సంభవామి యుగేయుగే"

అని వినసొంపుగా చెప్పింది. ఆ పాపకి అయిదు సంవత్సరాలు. సుజాత ఆ పిల్లనే దీక్షగా చూస్తూ ఉండిపోయింది. తర్వాత పిల్లలంతా కంచాలు, గ్లాసులు ఎవరివి వారు తెచ్చుకుని వరసగా కూర్చున్నారు. అందులో నలుగురు పెద్దపిల్లలు అందరికీ వడ్డించి వారుకూడా కూర్చుని అంతాకలసి భోజనం చేశారు. భోజనం చేసేటపుడు వారి మొహంలో కనపడిన ఆనందం వర్ణించలేనిది.

భోజనానంతరం పిల్లలంతాకలసి ఏక కంఠంతో "లాంగ్ లివ్ అభిషేక్" అని పలికారు.

ఇంటికి వచ్చిన సుజాతకి ఆ పాపే గుర్తు రాసాగింది. ఆ పాపని చూస్తే ఏదో ఆత్మీయత కలుగుతోంది. రాత్రి నిద్రపట్టలేదు.

మర్నాడు ఉదయం సుజాత ఒక నిర్ణయానికి వచ్చింది. శేఖర్‌తో ఆ పాపని మనం పెంచుకుందామని చెప్పి ఒప్పించింది.

శేఖర్, సతీష్ కలసి అనాథాశ్రమానికి వెళ్లి మేనేజర్‌తో మాట్లాడి ఆ పాపని తాము పెంచుకుందుకు ఒప్పించి ఇంటికి తీసుకువచ్చారు. సుజాత ఆ పాపకి కీర్తి అని పేరు పెట్టింది.

పాపని బజారుకి తీసికెళ్లి కావలసిన బట్టలూ వగైరాలన్నీ కొన్నారు. తలంటి నీళ్లు పోసి కొత్తబట్టలు తొడిగితే కీర్తి ఎంతో అందంగా ఉంది.

కీర్తి సుజాతని అమ్మా అనీ, శేఖర్‌ని నాన్నా అనీ పిలవడం అలవాటు చేసుకుంది. ఒక వారంపోయాక శేఖర్, సుజాత కీర్తిని తీసుకుని వైజాగ్ వచ్చేశారు.

కీర్తిని మంచిస్కూల్లో చేర్పించారు. ఇన్నాళ్లకి తమకి పిల్లలులేరనే బాధ ఈ విధంగా తీరినందుకు సుజాత చాలా ఆనందించింది. శేఖర్, సుజాతలు కీర్తిని ప్రాణంతో సమానంగా పెంచుతున్నారు.

"కంటేనే కూతురా! పెంచుకుంటే మాత్రం కూతురు కాదా!" అనేస్థాయికి సుజాత మనసు ఎదిగింది.

అంతేకాదు పెంచుకుంటే కొడుకుని కాదు. కూతుర్నే పెంచుకోవాలి అని తెలుసుకుని ఆచరించగలిగింది.